వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com
# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 202 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/-

## ప్రజలకు సత్వర న్యాయం అందాలంటే న్యాయవాదులు ఉత్సాహంగా పనిచేయాలి







### -రాష్ట్ర హైకోర్టు జడ్జి మరియు జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి బి.విజయసేన్ రెడ్డి అన్నారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి




ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్

శనివారం చేర్యాల పట్టణంలో ఫస్ట్ క్లాస్ సివిల్ జూనియర్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల, కొమరవెల్లి, ధూల్ మిట్ట మరియు మద్దూర్ ప్రాంత ప్రజలకు న్యాయ సేవలను అందించేందుకు మేము బాధ్యతగా చేర్యాల పట్టణంలో జూనియర్ సివిల్ కోర్టును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. లాయర్ ఉద్యోగం చాలా స్వేచ్ఛతో కూడుకున్నదని ప్రజలకు మంచి జరగాలంటే మీరు ఉత్సాహంతో పనిచేసి ఈ కోర్టు ద్వారా ఈ ప్రాంత ప్రజలకు కాలయాపన చేయకుండా న్యాయ సేవలు అందించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. కోర్టు కేసుల పరిష్కారంలో నూతన టెక్నాలజీ చాలా ఉపయోగకంగా ఉంటుందని భవిష్యత్తులో ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్ కూడా న్యాయ వ్యవస్థలో కీలకపాత్ర పోషించనున్నదని అన్నారు. కుటుంబ తగాదాల కేసులను సామాజిక స్పృహతో పరిష్కరించాలని అన్నారు. ప్రస్తుతం ప్రజల ఆర్థిక స్థితి గతంతో పోలిస్తే పెరిగిందని, 20, 30 సంవత్సరాలుగా ఎంతో కష్టపడితే అది సాధ్యమైందని. ఇప్పుడు పెరిగిన ఆర్థిక స్థితిని చూసి ఈ జనరేషన్ కు కష్టం విలువ తెలియకుండా పెంచరాదని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వవలసింది ఆస్తులు, అంతస్తులు కాదని మంచి విద్యా క్రమశిక్షణ అందించాలని అన్నారు. సీనియర్ లాయర్లు జూనియర్ లాయర్లకు అవకాశాలు కల్పించి వారు వృత్తిపరంగా ఎదిగేలా ప్రోత్సహించాలని అన్నారు. ఈ కోర్టు ఓపెనింగ్ కార్యక్రమానికి ఇంత పెద్ద సంఖ్యలో వచ్చిన మిమ్మల్ని చూస్తేనే ఈ ప్రాంతాల కోర్టు ఏర్పాటు ఎంత అవసరమో తెలుస్తుందని అన్నారు. జిల్లా ప్రిన్సిపాల్ % డ% సెషన్స్ జడ్జి సాయి రమాదేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకు ప్రముఖ స్థానం ఉందని చేర్యాలలో కోర్టు ఏర్పాటుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు అన్నారు. ఈ ప్రాంత పౌరులకు సత్వర న్యాయ సేవలు అందించేందుకు చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఇన్చార్జి జిల్లా కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ ఈ ప్రాంత దీర్ఘకాలిక అభివృద్ధికి ఈ కోర్టు ఏర్పాటు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. సిద్దిపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్. జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ 20 సంవత్సరాల కల చేర్యాలలో కోర్టు ఏర్పాటు అని దానిని సహకారం చేసినందుకు ధన్యవాదాలు అని తెలిపారు. ఈ సందర్భంగా జనగామ శాసనసభ్యులు పళ్ళ రాజేశ్వర్ రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మి లు హైకోర్టు జడ్జిని మరియు జిల్లా జడ్జిని పూల బోకే శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాసాధికారి సంస్థ ద్వారా దివ్యాంగులకు ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిస్టిక్ జడ్జ్, సిద్దిపేట, జనగామ, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సభ్యులు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 202 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|


## ఢిల్లీలో ముక్కోణపు

# సిరీస్..!

## ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల వేడి

- ఆప్ ప్రతిష్టకు సవాల్ కానున్న ఎన్నికలు
- వరుసగా మూడోసారి విజయంతో హ్యాట్రిక్‌పై కన్ను
- ప్రతిష్టగా తీసుకుని పోరాడుతున్న బీజేపీ




**న్యూఢిల్లీ,**
దేశరాజధానికి అసెంబ్లీగా ఉన్న ఢిల్లీ ఎన్నికలపై పట్టుకోసం బిజెపి ఎత్తులు వేస్తోంది. ఇప్పటి వరకు రెండు ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన ఆప్ మరోమారు గెలుపు ద్వారా హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. అయితే ఢిల్లీ లిక్కర్ స్కామ్ సహా అనేకమంది నేతలు అవినీతి కేసుల్లో ఇరుక్కుని జైలుకు వెళ్లడంతో ఆప్ ప్రతిష్ట కొంత మసకబారింది. మరోవైపు ఆప్‌కు చెందిన పలువురు నేతలు పార్టీని వీడారు. ఈ క్రమంలో ఆప్‌కు గతంలో ఉన్న ఛరిష్మా కనబడడం లేదు. అందువల్ల బిజెపి ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఫిబ్రవరిలో జరిగే ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిదన్నది ఆసక్తిగా -మిగతా 3 లో



## పార్టీలో పనిచేసిన వారికే పదవులు

- త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన
- సంక్రాంతి తరవతా మంత్రివర్గ విస్తరణపై స్పష్టత
- దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నాం
- మీడియా సమావేశంలో టీపీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,**
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వెల్లడించారు. నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి పేరు చాలా మంది -మిగతా 3 లో



## మెట్రో రైళ్లు ఫుల్..
## బస్టాండ్లు కిటకిట

- సంక్రాంతికి ఊరెళ్లిన పట్నవాసులు
- జాతీయ రహదారులపై వాహనాల బారులు టోల్‌గేట్ల వద్ద గంటలతరబడి క్యూలు
- నగరం నుంచి ప్రత్యామ్నాయా మార్గాల్లో పంపించిన పోలీసులు

**హైదరాబాద్/**
సంక్రాంతి పండగ సందర్భంగా నగరవాసులు వాహనాల్లో సొంతూళ్లకు క్యూకట్టడంతో.. దాదాపు అన్ని రూట్లలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఏటా ఇదేతంతు కనిపించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. -మిగతా 3 లో



## భూ భారతితో సమస్యలకు చెక్

కేసీఆర్ ఇష్టానుసారంతో ధరణి సమస్యలు
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**నల్గొండ,**
ఇందిరమ్మ ఇళ్లలో గిరిజనులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తన గెలుపులో గిరిజనుల పాత్ర అధికంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పది శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావడంలో తన కృషి కూడా ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి తండాలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశ చరిత్రలో -మిగతా 3 లో

## పనులను వీలైనంత త్వరగా
# పూర్తిచేయాలి



- నెలాఖరులోగా కొత్త ఉస్మానియా నిర్మాణానికి శంకుస్థాపన
- పలు నమూనాలు పరిశీలించిన సీఎం
- ఉస్మానియాపై అధికారులతో సమీక్ష
- కార్పోరేట్‌కు దీటుగా ఉండాలని రేవంత్ ఆదేశం
- ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సీఎం

**హైదరాబాద్,**
ఈ నెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి -మిగతా 3 లో



## టెట్ పరీక్షలో గందరగోళం

- సర్వర్ డౌన్‌తో 150మంది పరీక్షకు దూరం

**హైదరాబాద్,**
తెలంగాణలో నిర్వహిస్తోన్న టెట్ పరీక్షలో గందరగోళం నెలకొంది. శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన టెట్ పరీక్షా కేంద్రంలో గందరగోళం చోటు చేసుకుంది. రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2గంటలకు మొత్తం -మిగతా 3 లో

## రాష్ట్రంలో గ్రీన్
# ఎనర్జీ విప్లవం

- కాలుష్య రహిత వాతావరణం ఏర్పాటు
- గ్రీన్ ఎనర్జీ ద్వారా రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు
- హరిత ఇంధన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్
- మీడియాతో ఇష్టాగోష్టిలో చంద్రబాబు నాయుడు



**అమరావతి,**
రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ విప్లవం రానుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విద్యుత్ రంగలో ఇదో విప్లవానికి నాంది కానుందని అన్నారు. రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు గ్రీన్ ఎనర్జీ రూపంలో రానున్నాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ -మిగతా 3 లో



## తెలంగాణలో సంవిధాన్ బచావో కార్యక్రమం

-27న హాజరుకానున్న రాహుల్, ఖర్గే

**హైదరాబాద్,**
కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఈనెల 27న తెలంగాణ పర్యటనకు రానున్నారని కాంగ్రెస్ హైకమాండ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. -మిగతా 3 లో


# నేటినుంచి పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్

**పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి**



**హైదరాబాద్,**
సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఫెస్టివల్ పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటారని తెలిపారు. ఇండోనేషియా, శ్రీలంక, నేపాల్, స్కాట్‌లాండ్, మలేషియా, ఇటలీ, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ సహా మొత్తం 50 దేశాలకు చెందిన దాదాపు 150 మంది ప్లయర్స్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఫెస్టివెల్ ఉంటుందన్నారు. గ్రామాల్లో కూడా సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించేలా పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రాచీన కట్టడాలను, దేవాలయాలను పరిరక్షించాల్సి ఉందన్నారు. తెలంగాణ టూరిజం అందుకు తోడ్పాటును అందిస్తుందన్నారు.

## బీఆర్ఎస్ మహా రైతు ధర్నా వాయిదా



**నల్లగొండ,**
నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించబోయే బీఆర్ఎస్ మహా రైతు ధర్నా వాయిదా పడింది. సంక్రాంతి పండుగ ప్రయాణాలు, విజయవాడ – హైదరాబాద్ హైవేపై ట్రాఫిక్ రద్దీతో పాటు తదితర కారణాలతో పండుగ తర్వాత మహాధర్నా నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతోపాటు రైతు రుణమాఫీ, రైతుభరోసా మోసాలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇప్పటికే రైతు భరోసా కుదింపుపై ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రైతులు కొద్దిరోజులుగా ఆగ్రహంతో రోడ్లపైకి వస్తున్నారు. రైతుల ఆందోళన, ఆవేదనకు మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రంగంలోకి దిగుతున్నారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నీ తూ.చ. తప్పకుండా అమలు చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఈ రైతు మహాధర్నాకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పార్టీ ప్రకటించింది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో మహాధర్నాకు ఏర్పాట్లు జరుగుతున్నప్పటికీ.. సంక్రాంతి పండుగ రద్దీ, ఇతర కారణాల వల్ల వాయిదా వేశారు.

## అయోధ్యలో బాల రాముడికి అభిషేకం



**న్యూఢిల్లీ,**
అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామ మందిరంలో రామ్‌లల్లాను ప్రతిష్టాపన చేసి ఏడాది కావొస్తోంది. ఈ సందర్భంగా అయోధ్యలో ప్రత్యేక వేడుకలను నిర్వహిస్తున్నారు. ప్రధాన వేడుకలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. మొదట బాలరాముడికి మహాభిషేకం నిర్వహించారు. పంచామృతం, సరయూ నది నుంచి తెచ్చిన పవిత్ర జలంతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు ఉదయం నుంచే ఆలయంలో క్యూ కట్టారు. కాగా, నేటి నుంచి జనవరి 13 వరకూ ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు జరగనున్నాయి. బాలరాముడికి అభిషేకం చేస్తున్న వీడియో వైరల్ అవుతోంది. మరోవైపు తొలి వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు గ్రీటింగ్స్ తెలిపారు. ఎక్స్ అకౌంట్‌లో ఆయన పోస్టు చేస్తూ.. భారతీయ సంస్కృతి, ఆధ్మాత్మికతకు గొప్ప వారసత్వంగా ఈ ఆలయం నిలుస్తుందని ఆయన అన్నారు. ఎన్నో శతాబ్ధాల త్యాగాలు, పోరాటాల ద్వారా ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. నూతన భారత్‌ను నిర్మించే అంశంలో ఈ దివ్య, భవ్య అయోధ్య రామాలయం దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు.

# మైనర్‌పై 60 మందికి పైగా లైంగిక వేధింపులు

**తిరువనంతపురం,**
కేరళ రాష్ట్రంలో దారుణం జరిగింది. మైనర్ అయిన ఓ క్రీడాకారిణిపై ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 60 మంది లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. గడిచిన ఐదేళ్లల్లో తనపై 60 మందికి పైగా లైంగిక వేధింపులకు పాల్పడ్డారని 18 ఏళ్ల ఆ క్రీడాకారిణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను మైనర్‌గా ఉన్నప్పుడే ఇదంతా జరిగిందని తన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు సంబంధించి మహిళ సమాఖ్య నిర్వహించిన కౌన్సిలింగ్ సెషన్‌లో క్రీడాకారిణి తనకు జరిగిన దారుణాల గురించి వివరించింది. 13 ఏళ్ల ప్రాయంలోనే తనపై అత్యాచారం జరిగిందని యువతి తన ఫిర్యాదులో పేర్కొంది. తన పొరుగింట్లో ఉన్న ఓ వ్యక్తి తనను కొండల ప్రాంతానికి తీసుకెళ్లి ముగ్గురు స్నేహితులతో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. ఆ తర్వాత కోచ్‌లు, క్లాస్?మేట్స్, అథ్లెట్స్?ఎక్కువగా లైంగికంగా వేధించారని



వెల్లడించింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోలీసులు 62 మందిని అనుమానితులుగా గుర్తించారు. వారిలో 40 మందిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. వారిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బాధితురాలిని కౌన్సిలింగ్‌కు పంపించినట్లు పథనంథిట్ట ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఒక ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

## 8నెలలుగా ఫ్రిడ్జ్‌లోనే మహిళ మృతదేహం



**భోపాల్,**
మధ్యప్రదేశ్‌లోని దివాస్‌లో సహజీవనం చేస్తున్న మహిళను చంపేశాడు ఓ వ్యక్తి. అయితే ఆమెకు చెందిన మృతదేహాన్ని ఓ ఫ్రిడ్జ్‌లో గుర్తించారు. సుమారు 8 నెలల నుంచి రిఫ్రిజిరేటర్‌లోనే ఆమె శవం ఉన్నట్లు పోలీసులు చెప్పారు. శుక్రవారం ఓ ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ నుంచి ఆ మహిళ శవాన్ని వెలికి తీశారు. చీరలో ఉన్న ఆమె చేతుల్ని కట్టేశారు. మెడలో బంగారు ఆభరణాలు ఉన్నాయి. నిందితుడు సంజయ్ పటిదార్ తన ఇంటిని కిరాయి ఇవ్వడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మృతురాలను పింకీ ప్రజాపతిగా గుర్తించారు. ఆమెను గత ఏడాది జూన్‌లో హత్య చేసి ఉంటారని అంచనా వేస్తున్నారు. నిందితుడు పటిదార్ .. ఉజ్జయిన్ నివాసి. గత అయిదేళ్లతో నుంచి బాధిత మహిళతో అతను లివిన్ రిలేషన్‌లో ఉన్నారు. పెళ్లి చేసుకోవాలని వత్తిడి చేయడం వల్లే.. పటిదార్ ఆ మహిళను చంపి ఉంటారని భావిస్తున్నారు. స్నేహితుడి హెల్ప్ తీసుకుని హత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. ఇంట్లో నుంచి చెడు వాసన రావడంతో.. ఓనర్‌ను పిలిపించారు. అయితే ఓ రూమ్‌ను తెరవగా దాంట్లో ఉన్న ఫ్రిడ్జ్‌లో మహిళ శవాన్ని గుర్తించారు. ఇంటి ఓనర్ ధీరేంద్ర శ్రీవాత్సవ్.. ఇండోర్‌లో ఉంటాడు.

## తెరుకోని ఉత్తరాది రాష్ట్రాలు

**-220కి పైగా విమానాల రాకపోకలకు ఆలస్యం**



**న్యూఢిల్లీ,**
ఉత్తరాది రాష్ట్రాలపై పొగమంచు తీవ్రత కొనసాగుతోంది. ఢిల్లీ సహా సమీప రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు దుప్పటి కారణంగా దృశ్యమానత జీరోకు పడిపోయింది. దీంతో రోడ్డు, రైలు, విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. శనివారం ఉదయం ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై విజిబిలిటీ జీరోగా నమోదైంది. దీంతో ఢిల్లీకి రాకపోకలు సాగించే దాదాపు 220కిపైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఢిల్లీలో ఇవాళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఢిల్లీతోపాటు నోయిడా, ఫరీదాబాద్, ఘజియాబాద్, గురుగ్రామ్‌లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్థానిక వాతావరణ కేంద్రం అంచనా వేసింది. మరోవైపు ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హర్యానా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో వారణాసి, లక్నో, ఆగ్రా, పాట్నా, బరేలీ విమానాశ్రయాల్లో విజిబిలిటీ జీరోకు పడిపోయింది. ఈ కారణంగా ఆయా విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా కోల్‌కతాలోని శుభాష్ చంద్రబోష్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దాదాపు 19 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

# తండ్రీకొడుకుల ప్రాణం తీసిన సెల్ ఫోన్..

**మహారాష్ట్ర:**
స్మార్ట్ ఫోన్ ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తండ్రి స్మార్ట్ ఫోన్ కొనివ్వలేదని కొడుకు ఆత్మహత్యకు పాల్పడగా, కొడుకు లేని జీవితం తనకెందుకు ఆ తండ్రి కూడా బలవన్మరణం చెందిన ఘటన మహారాష్ట్రలో జరిగింది. నాందేడ్ ప్రాంతానికి చెందిన ఓంకార్ 10వ తరగతి చదువుతున్నాడు. 16 ఏళ్ల ఓంకార్ ముగ్గురు అన్నదమ్ముల్లో చివరివాడు. అన్నదమ్ములు ముగ్గురు ఉద్గిర్ లోని హాస్టల్ లో ఉంటూ చదువుకుంటున్నారు. మకర్ సంక్రాంతి సెలవుల కోసం ఓంకార్ స్వగ్రామానికి వచ్చాడు. స్మార్ట్ ఫోన్ కొనివ్వాలని తండ్రిని కోరాడు. ఆన్ లైన్ క్లాసులు, ఇతర విద్యా ప్రయోజనాల కోసం స్మార్ట్ ఫోన్ అవసరమని తండ్రికి చెప్పాడు. అయితే, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆ తండ్రి స్మార్ట్ ఫోన్ కొనివ్వలేకపోయాడు. దాంతో మనస్తాపం చెందిన ఓంకార్ ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి అతడి కోసం వెదికాడు. తమ పొలంలోని ఓ చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో ఓంకార్ విగతజీవుడిలా కనిపించాడు. ఆ దృశ్యం చూసి దిగ్భ్రాంతి చెందిన తండ్రి%ౌ% ఓంకార్ మృతదేహాన్ని కిందికి దింపి, అదే తాడుతో అదే చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు తండ్రీకొడుకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలకు



కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒకే కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడడంతో వారి గ్రామంలో

# ఢిల్లీలో ముక్కోణపు సిరీస్..!

(మొదటి తరువాయి)

మారింది. ఇప్పుడు ఎక్కడ చూసినా ప్రధానంగా ఢిల్లీ ఎన్నికలపైనే చర్చ నడుస్తోంది.. ఎందుకంటే దేశానికి రాజధానిగా ఉన్న ఢిల్లీలో ఏ పార్టీలో అధికారంలోకి వస్తుందోనని అంచనాలు వేసుకుంటున్నారు. అయితే ఢిల్లీలో ఎవరు గెలుస్తారో అటుంచితో అసలు ఢిల్లీ ఎన్నికలు ఎప్పుడు మొదలయ్యాయి.. మొదటిసారిగా ఎవరు అధికారంలోకి వస్తారు అనే విషయాలపై ఒక్కసారి వెనుక్కు వెళదాం.. ఢిల్లీ లెజిస్టేటీవ్ అసెంబ్లీ మొదటిసారిగా మార్చి 7 1952న పార్ట్ సీ కింద ఏర్పాటైంది. దీనిని హెూంమంత్రి కట్టూ ప్రారంభించారు. అసెంబ్లీలో అప్పుడు 48 మంది సభ్యులు ఉన్నారు. ఢిల్లీ ప్రధాన కమిషనర్‌కు సలహాదారు పాత్రలో మంత్రుల మండలి ఉంది. అయినప్పటికీ చట్టాలు చేసే అధికారాలు కూడా దీనికి ఉన్నాయి. మొదటి మంత్రి మండలికి చౌదరి బ్రహ్మప్రకాష్ నాయకత్వం వహించారు. ఆయన ఢిల్లీకి మొదటి ముఖ్యమంత్రి కూడా. అయితే 1953 రాష్ట్రాల పునర్వవస్థీకరణ కమిషన్, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం 1956 ద్వారా రాజ్యాంగ సవరణకు దారితీసింది. ఇది నవంబర్ 1 1956 నుంచి ఆమలులోకి వచ్చింది. దీని అర్థం ఢిల్లీ ఇకపై పార్ట్ సీ రాష్ట్రం కాకుండా యూనియన్‌గా మార్చబడింది. భారత రాష్ట్రపతి ప్రత్యక్ష పరిపాలనలో పాలించబడింది. దీంతో అప్పటి వరకు ఉన్న శాసన సభ, మంత్రి మండలి కూడా ఒక్కసారిగా రద్దయ్యాయి. తదనంతరం ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం 1957 అమల్లోకి వచ్చింది. అలాగే 1966లో ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ 56 మంది ఎన్నికై, ఐదుగురు నామినేట్ చేయబడిన సభ్యులుతో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను అధిపతిగా నియమించారు. అయితే కౌన్సిలుకు శాసన అధికారాలు మాత్రం లేకుండాపోయాయి. ఇలా 1990 వరకు కొనసాగుతూ వచ్చింది. మళ్లీ 1993 సంవత్సరంలో ఢిల్లీ 70 శాసన సభా శాసన సభ ఏర్పాటైంది. అయితే 1993 నుంచి 2008 జరిగిన నాలుగుసార్ల ఎన్నికల్లో ప్రజలు ఏకపక్ష తీర్పునిచ్చారు. ఒకసారి బీజేపీకి ఇస్తే, మిగిలిన మూడుసార్లు కాంగ్రెస్సుకు ఇచ్చారు. మొట్టమొదటిసారిగా 2013లో జరిగిన ఎన్నికల్లో హంగు వచ్చింది. ఇందులో బీజేకీ 32 సీట్లు వచ్చి అతిపెద్ద పార్టీగా అవతరించింది. అప్పటికి పార్టీ స్థాపించి ఒక ఏడాది మాత్రమే అయిన ఆమ్‌ఆద్మీ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసి 28 స్థానాలను కైవశం చేసుకుంది. కేవలం 8 సీట్లకే పరిమితమైన కాంగ్రెస్ ఆప్ పార్టీకి మద్దతు ఇవ్వటంతో ఆప్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే అవినీతి నిరోధక ఎజెండాపై అదికారాన్ని జేజిక్కించుకున్న ఆప్ పారీఅవినీతిని దర్యాప్తు చేయటానికి స్వతంత్ర సంస్థను రూపొందించటానికి జన్‌లోక్‌పాల్ బిల్లును ఆమోదించటానికి ముందుకొచ్చింది. కానీ దాని పదవీకాలం రెండు నెలలలోపే ఉండటంతో ఆప్ జాతీయ కన్వీనర్, మొదటిసారి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లోక్‌పాల్ బిల్లును ఆమోదించడంలో విఫలమయ్యారు. దీంతో ఆయన రాజీనామా చేయడంతో మళ్లీ రాష్ట్రపతి పాలనలోకి వెళ్లింది. అయితే 2015 ఢిల్లీ ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలు వచ్చాయి. ఆప్ పార్టీ అఖండ విజయంతో తిరిగి అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీలో సీట్లలో 67 సీట్లు మరియు అత్యదికంగా 54.34 ఓట్ల శాతం సాధించింది. బీజేపీ మూడు స్థానాలు రాగా కాంగ్రెస్ ఖాతా తెరవకుండాపోయింది. అధికారంలోకి వచ్చిన ఆప్‌పార్టీ మహిళలకు ఉచిత నీరు, విద్యుత్, ప్రజా రవాణా సహా అనేక సంక్షేమ పథకాలు అమలుతో ఆప్ పార్టీ 2020 మరోసారి భారీ మెజార్టీ విజయం సాధించింది. అయితే 2025 కంటే కొంచెం తక్కువగా 62 సీట్లు మాత్రమే వచ్చి 53.57 శాతం ఓట్ల శాతానికి సాధించింది. బీజేపీకి 8 స్థానాలు రాగా ఓట్లు శాతం 38.51 శాతానికి పెంచుకుంది. కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో కూడా ఖాతా తెరవకుండాపోయింది. అయితే 2025 ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనేది వీడని చిక్కుముడిగా మిగిలిపోయింది.

# రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ విప్లవం

(మొదటి తరువాయి)

తయారవుతుందని అన్నారు. మిగిలిన ప్రాంతాల్లో తయారయ్యే సౌర, పవన, పనీపడ్ స్టోరేజ్ విద్యుత్‌ను పూడిమాడకకు తెస్తే వాటి ద్వారా హెడ్రోజన్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. ఉత్పత్తయ్యే హైడ్రోజన్‌తో ఎరువులు, రసాయనాలు తయారవుతాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మీడియాతో ఇష్టాగోష్టి సందర్భంగా హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని దీంతో ఎగుమతులు పెరిగి మనకు లాభం వస్తుందని చెప్పారు. అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడితే వేడి బాగా తగ్గుతుందని తెలిపారు. ఎన్టీపీసీలో బొగ్గు మండించటం ద్వారా వచ్చే కార్బన్ డైయాక్సైడ్‌ని పూడిమడక తెచ్చి హైడ్రోజన్ ఉత్పత్తికి వాడితే కాలుష్యం తగ్గుతుందన్నారు. గ్రీన్ కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్‌ను టెకోవర్ చేసి గ్రీన్ ఆమోనియా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తారని చెప్పారు. ఈ ఎ÷-లాంట్ మీద రూ.25వేలకోట్ల పెట్టుబడులు పెడుతున్నారన్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఎగుమతులు జరుగుతాయని చెప్పారు. రిలయన్స్ కంపెనీ బయో కంప్రెస్డ్ గ్యాస్ తయారీకి 500కేంద్రాలు పెడుతోందని వివరించారు. ఒక్కో కేంద్రం రూ.130కోట్ల పెట్టుబడి పెడుతున్నారని చెప్పారు. బయోగ్యాస్‌కు ఉపయోగపడే గడ్డి ద్వారా ఇది తయారవుతుందని తెలిపారు. ఈ గడ్డి పెంచటానికి ఎకరాకు రూ.30వేల కౌలు రైతులకు రిలయన్స్ చెల్లిస్తుందన్నారు. ఈ కేంద్రాల వల్ల ఉద్యోగాలు వచ్చి, గ్యాస్ ఉత్పత్తిలో వచ్చే వ్యర్థాలు భూసారం పెంచేందుకు ఎరువు గానూ ఉపయోగపడుతుందని చెప్పారు. బెంగుళూరుకు చెందిన ఓ సంస్థ స్వాపింగ్ బ్యాటరీలు మోడల్‌ను కుప్పంకి తెచ్చిందన్నారు. కుప్పంలో సూర్యఘర్ అమల్లో ఉన్న ఇళ్లకు స్వాపింగ్ బ్యాటరీలు ఛార్జింగ్ చేసుకునేందుకు ఇంటి యజమానికి డబ్బులు చెల్లిస్తుందని అన్నారు. ఇది కుప్పం సూర్యఘర్ ఇంటి వాసులకు అదనపు ఆదాయం కానుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'ఈ కేంద్రాల వల్ల ఉద్యోగాలు వచ్చి, గ్యాస్ ఉత్పత్తిలో వచ్చే వ్యర్థాలు భూసారం పెంచేందుకు ఎరువు గానూ ఉపయోగపడుతుంది. బెంగుళూరుకు చెందిన ఓ సంస్థ స్వాపింగ్ బ్యాటరీలు మోడల్‌ని కుప్పంకి తెచ్చింది. కుప్పంలో సూర్యఘర్ అమల్లో ఉన్న ఇళ్లకు స్వాపింగ్ బ్యాటరీలు ఛార్జింగ్ చేసుకునేందుకు ఇంటి యజమానికి డబ్బులు చెల్లిస్తుంది. ఇది కుప్పం సూర్యఘర్ ఇంటి వాసులకు అదనపు ఆదాయం కానుంది.

# పార్టీలో పనిచేసిన వారికే పదవులు

(మొదటి తరువాయి)

చెప్పారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాలకు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి రిపోర్టు కేసీ వేణుగోపాల్ వద్ద ఉందన్నారు. పార్టీ నేతలందరూ వచ్చే 20 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని గట్టిగా హెచ్చరించారని చెప్పారు. ఈ నెలాఖరుకు పార్టీలో అన్ని కమిటీలు వేస్తామని, పనిచేసిన వారందరికీ పదవులు ఇస్తామని స్పష్టం చేశారు. పనిచేసిన నాయకులకే పదవులు వస్తాయన్నారు. కార్పొరేషన్ పదవుల భర్తీ ఈ నెలాఖరుకి పూర్తవుతుందని తెలిపారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ ఎప్పుడు ఉంటోందో తేల్చిచెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో చేరికలు కూడా జోరుగా ఉంటాయన్నారు. గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ప్రకటన ఉంటుందని తెలిపారు. సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ చేస్తామని ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నామని.. సంకాంత్రి తర్వాత చేరికలు ఉంటాయని వెల్లడించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్ర పక్షాలకు మద్దతు ఇస్తామన్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ అధికారి గంగాధర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు.కాగా.. గత కొద్దినెలలుగా తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్‌లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అంతా భావించారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దలతో చర్చలు కూడా జరిపారు. డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఖాయమని అప్పట్లో మంత్రులు కూడా ప్రకటనలు చేశారు. యితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా.. ఈ నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ క్రమంలో రేవంత్ పర్యటన నేపథ్యంలో కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం కానుందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకొచ్చారు. ఇప్పుడు అనూహ్యంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్వయంగా మంత్రి వర్గ విస్తరణపై ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది.

# మెట్రో రైళ్లు ఫుల్..బస్టాండ్లు కిటకిట

(మొదటి తరువాయి)

దీనికితోడు విజయవాడ రహదారిలో రిపేర్లు కూడా వాహనదారులకు పరీక్ష పెట్టాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డెక్కడంతో ఆయా ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. శనివారం నుంచి సెలవులు ప్రారంభం కావడంతో ఇటు విజయవాడ, అటు వరంగ్ల, ఇటు నిజామాబాద్రూట్లలో రద్దీ పెరిగింది. సొంత కార్లలో బయలుదేరిన వారికి ట్రాఫక్ జామ్ చీకాకు తెప్పించింది. టోల్‌గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో టోల్‌గేట్ల వద్ద రద్దీ లేకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనాలను దారి మళ్లించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పండగ రద్దీ నివారణకు చర్యలు తీసుకున్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్ నగరవాసులు స్వగ్రామాలకు బయలుదేరారు. వరుస సెలవులు ఉండటంతో సొంతూళ్లకు తరలివెళ్లారు. మరోవైపు పండగకు వెళ్లే వారితో మెట్రో రైళ్లలో రద్దీ నెలకొంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎల్బీనగర్, మియాపూర్, సికింద్రాబాద్, ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర ప్రాంతాలకు చేరుకునేందుకు మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్నారు. మియాపూర్, రాయదుర్గం, జేఎన్టీయూ, అమీర్‌పేట్, ఎంజీబీఎస్, పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, ఉప్పల్ తదితర స్టేషన్ల వద్ద రద్దీ నెలకొంది. సంక్రాంతి సెలవులు వచ్చాయంటే చాలు సొంతూళ్లకు పయనమవుతారు. ఈ క్రమంలో.. హైదరాబాద్-విజయవాడ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి పల్లెలకు వాహనాలు బారులు తీరాయి. ప్రతీసారి ఉన్నట్లే భారీ వాహనాల రద్దీతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. సంక్రాంతి సందర్భంగా సొంత ఊర్లకు పయనమైన వాహనాలతో టోల్ ప్లాజాల దగ్గర వాహనాల రద్దీ కొనసాగుతోంది. గత రాత్రి నుంచి ఇప్పటివరకు కూడా టోల్ గేట్స్ దగ్గర వాహనాల తాకిడి భారీగా ఉంది. జగ్గయ్యపేట దగ్గర చిలకల్లు, నందిగామ దగ్గర కీసర, గన్నవరం దగ్గర పొట్టిపాడు చెక్ పోస్టుల దగ్గర వాహనాల రద్దీ నెలకొంది. దీంతో సాధారణ రోజుల కంటే ఎక్కువ గేట్లను అందుబాటులో తెచ్చి వాహనాలను అనుమతి పంపిస్తున్నారు. రోజుకి సాధారణ రోజుల్లో 15 వేల వాహనాలు టోల్ గేట్ల నుంచి బయటకు వెళ్తుండగా.. ఇప్పుడు పండగ సీజన్ కావటంతో వాటి సంఖ్య 40,000 వరకు ఉంటుందని టోల్ గేట్ సిబ్బంది చెబుతున్నారు. వివిధ మార్గాల నుంచి వస్తున్న వాహనాలతో విజయవాడ నగరంలో ఫుల్ ట్రాఫిక్ జామ్ అవుతుంది.. ఇతర ప్రాంతాల నుంచి విజయవాడ వైపుకు వస్తున్న వాహనాలతో నగరంలోని ప్రధాన రహదారులు కిక్కిరిసి పోతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపై రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. వారధి వైపు నుంచి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాల వాహనాలు నగరంలోకి వస్తున్నాయి. అదే విధంగా హైదరాబాద్ హైవే నుంచి నగరంలోకి వచ్చి ఉభయ గోదావరి, విశాఖ వైపుకు భారీగా వాహనాలు తరలి వెళ్తున్నాయి.

# పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలి

(మొదటి తరువాయి)

రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసు కున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్ లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్ లలో పలు మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు సీఎం. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భగా గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించి శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన ఉస్మానియా ఆసుపత్రి, ఇతర నిర్మాణాలకు సంబంధించి నమూనా మ్యాప్ లను సీఎంకు వివరించిన అధికారులు. పలు మార్పులు, చేర్పులను రేవంత్ రెడ్డి సూచించారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సీఎం.. ప్రతి ఒక్కరూ ఊరెల్లి నలుగురితో కలవాలి.. ఇక, రాబోయే 50 ఏళ్ల కాలానికి గాను అవసరాలను అంచనా వేసి కొత్త ఆసుపత్రిని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆసుపత్రికి నలువైపులా రహదారులు ఉండేలని చూడాలన్నారు. చికిత్స కోసం అన్ని జిల్లాల నుంచి ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కనెక్టివిటీ రోడ్లను డెవలప్ చేయాలని సూచించారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాలను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

# భూ భారతితో సమస్యలకు చెక్

(మొదటి తరువాయి)

ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా భూ భారతి చట్టం రూపుదిద్దుకుంటుదన్నారు. భూ భారతిని గవర్నర్ కూడా ఆమోదించారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఇష్టారీతిన ధరణి అమలు చేసిందని.. కనీస నిబంధనలు కూడా లేకుండా ధరణి అమలు చేశారని తెలిపారు. ఫిబ్రవరి 15 లోగా భూ భారతి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అన్నారు. 2029లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని.. తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారం లోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు కూడా ఆర్థిక సాయం ఇవ్వడం గొప్ప విషయమని చెప్పారు. అందరికీ తెల్ల రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 కిలోల సన్న బియ్యం ఇస్తుందని ప్రకటించారు. రాజకీయంగా కూడా అందరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. అటవీ హక్కుల ప్రకారం మిగిలిన గిరిజనులకు భూములు ఇస్తామని మాటిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అందరం కలసి పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా ఒకటి రెండు హామీల అమలు ఆలస్యం అయిందని అన్నారు.

# టెట్ పరీక్షలో గందరగోళం

(మొదటి తరువాయి)

750 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 467 మంది హాజరయ్యారు. సర్వర్ డౌన్ కారణంగా 150 మంది అభ్యర్థులకు టెట్ పరీక్ష నిలిచిపోయింది. దీంతో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. అభ్యర్థులకు మద్దతుగా వారి కుటుంబ సభ్యులు శంషాబాద్- షాబాద్ రహదారిపై బైఠాయించారు.

# తెలంగాణలో సంవిధాన్ బచావో కార్యక్రమం

(మొదటి తరువాయి)

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి కావడంతో ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నిర్ణయించింది. ఈ సందర్భంగా తెలంగాణలో జరగనున్న 'సంవిధాన్ బచావో' ప్రదర్శనలో వారు పాల్గొనబోతున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల జరిగిన సమావేశంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, జనవరి 26, 2024 నుంచి జనవరి 26, 2026 వరకు దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర'ను చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ యాత్రను విజయవంతం చేయడానికి అన్ని స్థాయిల కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. మహేశ్‌కుమార్ గౌడ్ మంగళవారం పార్టీ శ్రేణులకు రాసిన లేఖలో, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ చొరవ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్టీ విస్తృత కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. 'సంవిధాన్ బచావో' ఉద్యమానికి ఈ పర్యటన కీలక మైలురాయిగా నిలుస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనబోతున్నారు

# సంపాదకీయం


## జాతిని జాగృతం చేసిన స్వామి వివేకానంద

భారతదేశాన్ని జాగృతము చెయ్యడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండులలో యోగ, వేదాంత శాస్త్రములను తన ఉపన్యాసముల ద్వారా, వాదనల ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి స్వామి వివేకానందది. ఆయన ఎప్పుడూ యువతను మేల్కొల్పుతూనే ఉంటారు. ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. భారతదేశ భవిష్యత్తుని మార్చగలిగేది యువతేనని. యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనేవారు. అందుకే 'డబ్బు లేని వాడు కాదు జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేదవాడు అంటారు'వివేకానంద. ఆయన ఎప్పుడు కూడా 'గొర్రెలలా కాదు సింహంలా ధైరంగా బ్రతకమని' దేనికి భయపడవద్దని అంటారు. 'ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూపాన్నే మార్చేస్తాను' అని స్వామిజీ తరచూ అనేవారు. మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను 'నేషనల్ యూత్ డే' గా జరుపుకుంటారు. ఆయన తన ప్రసంగాలతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్దేశం చేశారు. జీవితం నిరాశ నిస్పృహలతో నిండిపోయినప్పుడు, భయ భ్రాంతులకు గురైనపుడు, మనసు చెడు మార్గాలవైపు మళ్ళి ఏమిచెయ్యాలో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నపుడు ఒక్కసారి స్వామి వివేకానందకి సంబందించిన పుస్తకాలు, సూక్తులను చదవండి. వివేకానందుడి సందేశాలు సూటిగా మన హృదయాన్ని తాకుతాయి. మనసులో ఒక తెలియని ధైర్యం, ఆలోచనలో మార్పు కలుగు తుంది. జీవితానికి అసలైన అర్థం తెలుస్తుంది. నిద్రాణమై ఉన్న భారత జాతిని మేల్కొలిపిన ఆ మహనీయుడు, యుగ పురుషుడు ఎప్పటికి మన గుండెల్లో నిలిచే ఉంటారు. అమెరికాకు వెళ్ళి అక్కడ హిందూ మత ప్రాశస్త్యం గురించి ఎన్నో ఉపన్యాసాలు చేయడం ద్వారా భారత కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద. యువత తమ తెలివితేటలతో ఆధునిక భారత నిర్మాణానికి పూనుకోవడం ద్వారానే ఆయనకు నివాళి అర్పించగలదు.. భారతదేశాన్ని ప్రేమించి, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద. అతని వాగ్ధాటికి ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. ఎంతో మంది అతనికి శిష్యులయ్యారు. పాశ్చాత్య దేశాలలోకి అడుగు పెట్టిన మొదటి హిందూ సన్యాసి ఆయనే. తూర్పు దేశాల తత్త్వమును షికాగోలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనంలో 1893 లో ప్రవేశపెట్టాడు. అక్కడే షికాగోలోను, అమెరికాలోని ఇతర ప్రాంతాలలోను ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. తిరిగి భారత దేశం వచ్చిన వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి దీని ద్వారా భారత యువతకు దిశా నిర్దేశం చేశాడు. ఇంతటి ఘనత సాధించిన స్వామి వివేకానంద కేవలం ముప్పై తొమ్మిది ఏళ్ళ వయసు లోనే మరణించాడు. అతను చేసిన సేవలకు గుర్తింపుగా 1984లో భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా ప్రకటించింది. వివేకానందుడు తన సందేశంలో భారతదేశ మత సామరస్యాన్ని గురించి, వైవిధ్యాన్ని గురించి వివరించాడు. ప్రాచీన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో దాడులు ఎదుర్కొన్న నుంచి ఇజ్రాయెలీలు, పార్సీలు వంటివారిని స్వీకరించి హృదయాలకు హత్తుకున్న భారతదేశానికి చెందినవాడినని గర్విస్తున్నానన్నాడు. వివిధ మార్గాల ద్వారా సాగిన మానవులంతా భగవంతుణ్ణి చేరుకుంటారని చెప్పే హిందూ సూక్తులను, భగవద్గీత శ్లోకాన్ని ప్రస్తావించాడు. చారిత్రకంగా ఎన్నో నాగరికతలు, దేశాలను నాశనం చేసిన మూఢభక్తి, మతతత్వాలను సర్వమత సమ్మేళనం దూరం చేస్తుందని విశ్వసిస్తున్నట్టు చెప్పాడు. తరవాత రామకృష్ణ పరమహంస సాహచర్యలో జీవితం గడిపాడు. రామకృష్ణ పరమహంస నుంచి నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. అలా చదువుకుంటూనే మెల్లగా సన్యాస మార్గంలోకి నడిచాడు. కుటుంబ కష్టాలను ఈడుస్తున్న సమయంలోనే 1886లో రామకృష్ణ పరమహంస మరణించారు. రామకృష్ణులవారు చనిపోయిన తరువాత ఆయన శిష్యులందరూ కలిసి ఒక మఠాన్ని ఏర్పాటు చేసుకుని అందులో ఉండేవారు. వాళ్ళకి నరేంద్రుడు నాయకుడిగా ఉండేవారు. కొంతకాలం తరువాత వివేకానంద దేశమంతటా పర్యటించాలనుకున్నారు. భారతదేశమంతటా ప్రయాణించి భారతీయుల స్థితిగతులను ప్రత్యక్షంగా చూసారు.ఆ సమయంలో పేదవాళ్ళ పరిస్థితి చూసి చలించి పోయారు. భారత దేశం బానిసత్వంలో మగ్గిపోవడానికి, మూఢనమ్మకాలే కారణమని గుర్తించారు. భారతదేశంలోని వివిధ మతాలను వాటి తత్వాలలను అర్థం చేసుకున్నారు. భారతీయ ఆధ్యాత్మిక సందేశాన్ని ఇతర దేశాలకు అందించాలనుకున్నారు. అలా దేశమంతా పర్యటిస్తూ చివరికి కన్యాకుమారి చేరుకున్నారు. అక్కడ సముద్రంలో కొంత దూరంలో కనపడుతున్న ఒక చిన్న కొండ లాంటి ప్రదేశానికి ఈదుకుంటూ వెళ్లి అక్కడ మూడు రోజుల పాటు ధ్యానం చేసారు. ఆ ధ్యానంలో తాను ఇన్ని రోజుల నుండి చుసిన వాటిని స్పష్టంగా అర్థం చేసుకున్నారు. పాశాత్య దేశాలకు వెళ్లి భారతదేశపు గొప్పతన్నాని చాటాలని అలాగే తిరిగి వచ్చిన తరువాత నిరాశ నిస్పృహలతో నిండిపోయిన భారతీయులను మేల్కొలపాలని నిర్ణయించు కున్నారు. అయితే చికాగో లో జరగబోయే సర్వమత మహా సభలకు వెళ్లాలని, అక్కడ భారతదేశ గొప్పతన్నాని, ఆధ్యాత్మికను చాటి చెప్పాలనుకున్నారు. అలా షికాగో ద్వారా భారత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటారు. 1893 సంవత్సరం సెప్టెంబర్ 11 న తేదీన ప్రారంభమయ్యాయి. ఇతర మతాలకు చెందిన గొప్ప గొప్ప వాళ్ళందరూ.. సూటు బూట్లతో రెడీ అయ్యి ఉంటారు. కానీ వివేకానంద దుస్తులు, వేషధారణ చూసి ఆయన్ని ఎవరూ కూడా గౌరవించలేదు. చులకనగా చూస్తారు. సభలో ఒక్కొక్కరుగా లేచి వాళ్ళ మతాల గొప్పతనం గురించి మాట్లాడుతుంటారు. చివరగా స్వామి వివేకానంద వంతు రానే వచ్చింది. స్వామిజి నిల్చుని గంభీరమైన గొంతుతో 'అమెరికా దేశపు సోదర సోదరీ మణులారా' అని పలకరించే సరికి ఆ ఒక్క పిలుపికి సభలో ఉన్న 4000 మందికి పైగా జనం లేచి 2 నిమిషాల పాటు ఆగకుండా చప్పట్లు కొట్టారట. అప్పటి వరకు అందరు 'లేడీస్ అండ్ జెంటిల్ మెన్' అంటూ స్పీచ్ మొదలు పెట్టారు కానీ వివేకానంద సోదర సోదరీమణులారా అని పలకరించేసరికి ఆ పిలుపులో ఆత్మీయత వాళ్ళ హృదయాలను తాకింది. ఏ స్వార్థం లేని పిలుపుకి కొంతమంది కన్నీరు కూడా కార్చారు.

# శ్రమ జీవన సౌందర్యోత్సవం

శ్రమైక జీవన సౌందర్యానికి అద్దంపట్టే పండుగ సంక్రాంతి. పంటలు చేతికొచ్చేటప్పుడు జరుపుకునే వేడుక సంక్రాంతి.

ఉన్నత సంప్రదాయల్లో, ఆచార వ్యవహారాల్లో ప్రతి పండుగ వెనుక ఒక చారిత్రక కారణం ఉంది. ఓపిగ్గా పరిశీలిస్తే.. పండుగల వెనుక జాతి చరిత్ర, శ్రమ మూలాలు కనిపిస్తాయి. వాతావరణం, జీవావరణం, పర్యావరణం, భావ చైతన్య మహా సమ్మేళనమే మన పండుగలు అని అనిపిస్తుంది. పల్లె అందాలతో సరదాగా గడపాలి అంటే సంక్రాంతే సరైన సమయం. అలుకు చల్లిన వాకిళ్లు, నేల నలుచెరుగులా పరుచుకున్న ముగ్గులు, గొబ్బెమ్మలతో నిండిన వీధులు ఉంటాయి. ఆ ముగ్గులను చూసినప్పుడు నింగిలోని చుక్కలు దిగివచ్చి ముగ్గులై మురిశాయా.. హరివిల్లులోని వర్ణాలన్నీ ఆ ముగ్గుల్లో.. కొత్త అందాలు పరిచాయా అన్నట్టుగా.. ఆ రంగవల్లులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటాయి. మధ్యలో గొబ్బెమ్మలు, రేగుపళ్లు, చెరుకు గడలతో ముగ్గులు మరింత సింగారించుకుని సంక్రాంతికి ఆహ్వానం పలుకుతాయి. రంగురంగుల బట్టలు, గంటలు, గజ్జెలతో అలంకరించిన గంగిరెద్దులు, ధాన్యం నిండిన గరిసెలు, నువ్వుల బెల్లంతో చేసిన అరిసెలు, తీరొక్క దినుసులు, పసుపు కుంకుమ, పచ్చటి వాతావరణంలో నువ్వులు తిని నూరేండ్లు బతుకు.. చక్కెర తిని తీయగా మాట్లాడు అంటూ పంచిపెడతారు. సకినాలు, సర్వపిండి, సజ్జ రొట్టెలు, ఆకాశాన్ని తాకే గాలిపటాలతో పిల్లల ఆనందం అంబరమవుతుంది. ఏడాదిలో తొలి పండుగ. తెలుగువారి సొంతమైన పండుగ సంక్రాంతి. సొంత ఊరులో జరుపుకునే పండుగ. ఎక్కడ వున్నా ఈ పండుగకు మాత్రం ఊరికి పోవల్సిందే. అమ్మకోసం, ఊరమ్మ కోసమూ, మట్టివాసన, మధుర స్మృతుల కోసమూ పట్టణాల నుంచి పల్లెకు పరుగెడుతారుసంక్రాంతి మూడు రోజుల పండుగ. మొదటినాడు భోగి. భోగం అంటే ప్రకృతికి నివేదించే నైవేద్యం. కొత్త బియ్యంతో వండిన పసుపు అన్నం సమర్పిస్తారు. రైతులు ఆ దినాన పశు వులను చక్కగా కడిగి వాటి కొమ్ములకు రంగులు అద్దుతారు. ఆ మూగజీవాలను పూలదండలతోనూ అలంకరిస్తారు. ఎడ్లను గౌరవిస్తారు. వ్యవసాయ పరికరాలు, తమ బతుకులను నిలిపే పనిముట్ల పట్ల కృతజ్ఞతాభావం, అవి దైవ సమానాలనే నమ్మకం ప్రస్ఫుటంగా కనబడుతుంది. అందరి జీవితాలలో ఆనందోత్సాహాలను అందించడమే కాక కొత్త




వెలుగుల్ని ఇవ్వమని ప్రకృతిని వేడుకునే పండుగ. ఇవన్నీ శ్రమ సంస్కృతిలో భాగమైనవి. పండుగలు అన్నీ మతపరమైనవి కావు. మానవుని ఉత్పత్తి కార్యకలాపాలకు సంబంధించినవి. అంటే వ్యవసాయం, పశుపోషణ వంటివి. ప్రకృతి శక్తులను వశపరచుకున్నప్పుడు మానవుడు సాధించిన విజయాన్ని పురస్కరించుకొని ఈ పండుగలు జరుగుతుంటాయి. కరువు%-% కాటకాలు, విపత్తులు సంభవించినప్పుడు ప్రకృతిలోని వశంకాని శక్తులు అన్నింటిని దేవుడుగా, దెయ్యాలుగా కొలిచారు. కొన్ని పండుగలు పూర్తిగా మత నమ్మకాలపై పుక్కిటి పురాణ కథలతో ఆచార సంప్రదాయాలతో ఉన్నాయి. పండుగలు, జాతర్లు, ఉత్సవాలను మూఢనమ్మకాలనే పేరుతో కొట్టేయడం సరికాదు. తెలుగు రాష్ట్రాల్లో 'సంక్రాంతి', తమిళనాడులో 'పొంగల్' కేరళలో 'ఓణం' ..ఇలా గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో కళకళలాడే రోజు. బంతీ, చేమంతి పూలు, రేగుపండ్లు సమృద్ధిగా దొరికే కాలం. ఎడ్లను అలంకరించి, ఆటలు, పాటలతో కూడిన గ్రామీణ ఉత్పత్తితో ముడిబడిన వినోదాల సందర్భం. వీటిలో కూడా పెట్టుబడి ప్రవేశించింది. జూదంగా, వ్యసనంగా తాగుడు వంటి అనాచారాలు ప్రవేశించాయి. వినోదం కాస్తా విషాదమైపోయింది. పండుగల్లో ప్రజా దృక్పథం కొరవడింది. ప్రతి దాంట్లో మంచి సంస్కృతి, శ్రమ సంస్కృతిని గౌరవించాలి, ప్రోత్సహించాలి. మనిషి ఎప్పుడూ ఒంటరిగా లేడు. సమిష్టిగా పోరాడాడు. ప్రకృతిపై విజయాలను సమిష్టిగానే పంచుకున్నారు. నిప్పుపై మానవుని విజయమే, చీకటి నుంచి వెలుగుల ప్రయాణంగా చూశారు. ప్రకృతి ముందు ఓడిపోయినప్పుడు అతీత శక్తుల వైపు, నమ్మకాల వైపు అల్లుకున్నారు. సూర్యుడు, చంద్రుడు, చెట్టు, పుట్ట, పాము దేవుడిగా కొలిచారు. మొదట మానవుడు చెట్టును పుట్టను ప్రసన్నం చేసుకోవడానికి క్రతువులు ఆచరించాడు. వ్యవసాయ సమాజంలో ఋతుచక్రాన్ని తనకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రత్యేక పూజలు చేశాడు. ధాన్యం జీవనాధారం కనుక ధాన్యలక్ష్మి, ధనం జీవితంలో భాగమయ్యాక ధనలక్ష్మి పేరుతో కొలిచారు. వ్రతాలు, యాగాలు, దీక్షలు చేశారు. అర్థంకాని ప్రతి సమస్య ఆధ్యాత్మికం వైపు మరలింది. స్వార్థంతో ఒక జాతిని మరొక జాతి పీడించడం మొదలైనప్పుడే... ఆ పీడన నుండే విముక్తి కోసం పోరాటాలు జరిగాయి. జయాపజయాలు, పర్వదినాలు, దుర్దినాలుగా మారి మన సంస్కృతిలో భాగమయ్యాయి. పరాయి పీడన నుంచి విముక్తి కోసం జరిగిన పోరాటంలో నేలకొరిగిన వీరుల జన్మదినాలు పర్వదినాలైనాయి. పరాయి పాలన నుంచి విముక్తి జరిగిన దినాలు ముఖ్యమైన జాతీయ పండుగలయ్యాయి. 'కప్పం కట్టనుపో..' అన్న ప్రతి వారికి కత్తిలాంటి జ్ఞాపకం సమ్మక్క, సారక్కలు, గిరిజన వీరుడు కొమరం భీం, కేశ్లాపురం జాతర, కేవల్ కిషన్ జాతర, పండుగ సాయన్న, అమరుల శౌర్యాన్ని జాతర రూపంలో ప్రతి ఏడాది స్మరించుకుంటారు. నృత్యం, సంగీతం, ఆట, పాటలతో సంబురపడతారు. ఇదంతా మానవుడు సమిష్టి కృషితో సంపాదించిన భౌతిక సంపద, సాంస్కృతిక వారసత్వం. శ్రమ ఫలించి గాదెలు, గరిసెలు నిండిన రోజు సంక్రాంతి ఉత్పత్తితో ముడిబడింది. ఇది పూర్తిగా వ్యవసాయదారుల పంటల పండుగ. దేశ జనాభాలో 70 శాతం గ్రామీణ జనాభా. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. విదేశీ, స్వదేశీ, కార్పొరేట్ వినిమయ సంస్కృతి నుంచి కూడా పండుగలు ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి.

# భయ భక్తులు ఉన్నాయా?

తిరుపతిలో రెండు రోజుల క్రితం జరిగింది ఏమిటి? ఇప్పుడు జరుగుతున్నది ఏమిటి? ఒక పోలీసు అధికారి సదుద్దేశంతో అయినప్పటికీ అనాలోచితంగా గేట్లు తెరవడంతో... వైకుంఠ ద్వార దర్శనానికి టోకెన్ల కోసం భక్తులు ఎగబడటంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతి చెందారు. కుంభమేళాలు, పుష్కరాల సందర్భంగా తొక్కిసలాటలు జరిగి పలువురు మరణించిన సంఘటనలను గతంలో కూడా చూశాం. కాకపోతే అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఆరుగురు చనిపోవడం తిరుమల%-%తిరుపతి చరిత్రలో ఇదే ప్రథమం! దీంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హుటాహుటిన తిరుపతి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఇంతవరకు ఎవరికీ అభ్యంతరం లేదు. తొక్కిసలాట సంఘటన తర్వాత జరిగిన సన్నివేశాలు మాత్రం జుగుప్సాకరంగా ఉన్నాయి. కొండ మీద ఏం జరుగుతోంది? అన్న సందేహాలు తలెత్తాయి. ఈ సందర్భంగా రాజకీయాలు, వ్యక్తుల మధ్య వైషమ్యాలు బయటపడటం శోచనీయం. తిరుమలలో ఆ దేవదేవుడికి సేవ చేసుకొనే అవకాశం లభించడాన్ని మహాభాగ్యంగా పరిగణించాలి. అయితే, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని భావించాల్సిన సన్నివేశాలు చోటుచేసుకోవడమే అసలైన విషాదం. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే తిరుమల తిరుపతి పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్యామలరావు గొడవపడ్డారు. బాధ్యతాయుతమైన స్థానాలలో ఉన్న వారి మధ్య భేషజాలు ఏర్పడి భక్తులకు సౌకర్యాలు కల్పించే విషయమై సమన్వయం కొరవడినట్టు స్పష్టమవుతోంది. కీలక పదవులలో ఉన్న వారి మధ్య ఆధిపత్య పోరు జరుగుతుండటం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది.

### భయం లేదా...

సాక్షాత్తూ ముఖ్యమంత్రి సమక్షంలోనే గొడవపడటానికి చైర్మన్‌కూ, ఈవోకూ ఎంత ధైర్యం ఉండాలి? జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు ఎదురుగా కూర్చోవడానికి కూడా అధికారులు జంకేవారు.




తొలిసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన జగన్ వద్దనే అంతగా భయభక్తులు ప్రదర్శించిన అధికారులు పద్నాలుగేళ్లకు పైగా ముఖ్యమంత్రిగా వ్యవహరించిన చంద్రబాబు వద్ద ఎలా మెలగాలి? అలాంటిది ముఖ్యమంత్రి అంటే లెక్కలేనట్టుగా వ్యవహరించడమేమిటి? తిరుమలలో ఉన్నత స్థాయిలో సమన్వయం కొరవడిందని, వైషమ్యాలు పరాకాష్ఠకు చేరాయన్న విషయం ప్రభుత్వానికి ముందుగా తెలియదా? టీటీడీ ఈవో పదవి చేపట్టాలని ఐఏఎస్ అధికారులు పోటీపడుతుంటారు. పాలక మండలి చైర్మన్ పదవికి ఎంత గిరాకీ ఉంటుందో అందరికీ తెలిసిందే. ఈ పదవులకు ఎందుకంత డిమాండ్? దేవుడిపై భక్తితోనా? లేక... శ్రీవేంకటేశ్వరుడి దర్శనానికి వచ్చే ప్రముఖులతో పరిచయాలు పెంచుకొని తద్వారా తమ పలుకుబడి పెంచుకోవడానికా? అన్నది ఇక్కడ కీలకం. నిజానికి అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు మాత్రమే దేవుడిపై భక్తి ఉంటుంది. ఆ దేవుడి పుణ్యమా అని కొండమీద కొలువులు దక్కించుకున్న వారిలో కొందరికి దేవుడిపై అంతగా భక్తి ఉన్న దాఖలాలు లేవు. నిజంగా దేవుడిపై భక్తి ఉన్నా, పాప పుణ్యాలపై నమ్మకం ఉన్నా కొండమీద చేతి వాటాలు జరగవు కదా? దేవుడిపై నమ్మకంతో భక్తులు సమర్పించే కానుకలపై ఆధారపడి జీతభత్యాలు పొందుతున్న వారిలో ఎంత మందిలో నిజమైన భక్తి ఉంది? అంటే చెప్పడం కష్టం. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుల పోస్టులకు కూడా డిమాండ్ పెరిగింది. పాలక మండలి సభ్యుడి పోస్టు కోసం రూ.10 నుంచి 20 కోట్లు ఖర్చు చేయడానికి కూడా వెనుకాడని వారు ఉన్నారంటే ఎలా అర్థం చేసుకోవాలి? దేవుడిపై నిజమైన భక్తితో కొందరు ఆ పోస్టును ఆశిస్తుండగా, అత్యధికులు మాత్రం దీన్ని ఒక స్టేటస్ సింబల్‌గా పరిగణిస్తున్నారు. సొంత పలుకుబడి పెంచుకోవడానికి దాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నారు. ఈ క్రమంలోనే చైర్మన్, ఈవో, జాయింట్ ఈవో పోస్టులకు భారీ ఎత్తున లాబీయింగ్ జరుగుతుంది. కేవలం ఆ దేవ దేవుడి మీద భక్తితో మాత్రమే అయితే ఆధిపత్య పోరుకు దిగకూడదు కదా? దేవుడి సేవలో తరించాలి కదా! భగవంతుడి సన్నిధిలో పెత్తనం చేయాలనుకోవడం ఏమిటి? తామే పెత్తనం చేయాలన్న పట్టుదలలు పెరగడం వల్లనే అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆ దేవుడే లేకపోతే చైర్మన్, ఈవో పోస్టులు ఎక్కడివి అన్న స్పృహ ఉండాలి కదా!

# క్రీడలకు పుట్టినిల్లు పల్లెటూళ్ళు





-షాద్ నగర్ బీఆర్ఎస్ యువనేత వై. రవీందర్ యాదవ్

-తొమ్మిది రేకుల ప్రీమియర్ లీగ్ ను ప్రారంభించిన యువ నేత రవి

-యువతకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన యువనేత రవీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జనవరి 11 (ప్రజా స్వేచ్ఛ**

క్రీడలకు పుట్టినిల్లు పల్లెటూర్లు అని ఏ క్రీడ మొదలైన ముందుగా పల్లెటూర్లలోనే పుడుతుందని షాద్ నగర్ బీఆర్ఎస్ యువనేత, మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్ అన్నారు. కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో క్రికెట్ టోర్నమెంటును బీఆర్ఎస్ యువనాయకులు వై. రవీందర్ యాదవ్ లంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యాచ్ కు ముందు రవీందర్ యాదవ్ బ్యాటింగ్ చేస్తూ క్రీడాకారులను ఉత్తేజపరిచారు. అనంతరం మాట్లాడుతూ.. పల్లెటూర్లలో యువత సంక్రాంతి సందర్భంగా చేసే కోలాహలం గురించి చెప్పడం వర్ణతీతం అని అన్నారు. క్రీడలు స్నేహపూర్వకంగా ఆడుతూ గత స్మృతులను నెమరు వేసుకుంటూ పండగ వాతావరణాన్ని సృష్టించడం జరుగుతుందని, అదేవిధంగా స్నేహభావాన్ని పెంపొందించి దేహదారుడ్యానికి ఎంతో ఉపయోగపడేలా టోర్నమెంటులు యువత చేపట్టడం అభినందనీయమని అన్నారు. యువతకు తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలు అందరికీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ జడ్పీటీసీ నర్సింగరావు మాజీ సర్పంచులు సావిత్రి బాలరాజు, నవీన్ కుమార్ మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, నాయకులు భూపాల్ రెడ్డి, ప్రేమ్ కుమార్ గౌడ్, జమాల్ ఖాన్, సాజిద్, జగన్మోహన్, గణేష్ గౌడ్, వెంకటేష్ మరియు ఆర్గనైజింగ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

# గంగన్నగూడ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 ప్రారంభం

-ప్రీమియర్ లీగ్ లో పాల్గొన్న నాలుగు క్రికెట్ జట్లు

-గంగన్నగూడ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 ని ప్రారంభించిన పీఏసిఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి



**కొందుర్గు, జనవరి 11(ప్రజా స్వేచ్ఛ**

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని క్రీడల వల్ల శరీర దారుఢ్యం పెరుగుతుందని పీఏసిఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి అన్నారు. కొందుర్గు మండలం గంగన్నగూడ గ్రామంలో గంగన్నగూడ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 కి ముఖ్య అతిథిగా పిఏసిఎస్ చైర్మన్ చిట్టెం దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల శరీరానికి వ్యాయామం జరుగుతుందని, తద్వారా చాలా రకాల రోగాలకు దూరంగా ఉంటామని అన్నారు. గంగన్నగూడ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 లో నాలుగు జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు శివారెడ్డి, కృష్ణారెడ్డి, భూపాల్ రెడ్డి, ఇంద్రారెడ్డి, విక్రం రెడ్డి, లక్ష్మీ కాంత్ రెడ్డి, సత్యం రెడ్డి, సంజీవరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రాజు అలియాస్ రోహిత్ శర్మ, సంతోష్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఎల్వోసిని బాధిత కుటుంబానికి అందజేసిన గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జనవరి 11 ప్రజా స్వేచ్ఛ**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమని పిఏసి చైర్మన్ గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ కి చెందిన ఎస్ కే సోహైల్ కు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా ముఖ్య మంత్రి సహాయ నిధి సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2,50,000 ఆర్థిక సహాయానికి సంబందించిన సి ఎం ఆర్ ఎఫ్ ఎల్ ఓ సి మంజూరి పత్రాన్ని కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి బాధిత కుటుంబానికి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా పీ ఏ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ కి చెందిన ఎస్ కే సోహైల్ కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి సి ఎం ఆర్ ఎఫ్ ఎల్ఓసి ద్వారా మంజూరైన రూ.2,50,000 అని తెలిపారు. ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా.. సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజు, ఖాదర్ బాయ్, బోయ కిషన్, మోజేశ్, భాస్కర్, ఖలీమ్,అన్వర్

# రైతుల ఖాతాల్లో రూ.166.24 కోట్ల నగదు జమ



**మంచిర్యాల, జనవరి 11 ప్రజా స్వేచ్ఛ**

మంచిర్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూపాయలు 166.24 కోట్ల నగదును సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు అదనపు కలెక్టర్ మోతిలాల్ శనివారం తెలిపారు. 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 12,127 మంది రైతుల ఖాతాలో నగదు జమ చేశామన్నారు. జిల్లాలో 29 రైస్ మిల్లర్లకు సీఎంఆర్ జారీ చేసినట్లు పేర్కొన్నారు.

# హాస్టల్ వెల్ఫేర్ సంక్షేమాధికారుల సంఘం క్యాలెండర్ను ఆవిష్కరించిన టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి



**మంచిర్యాల, జనవరి 11 ప్రజా స్వేచ్ఛ**

శనివారం రోజు ఐ డి ఓ సి కార్యాలయం మంచిర్యాలలో హాస్టల్ వెల్ఫేర్ సంక్షేమ అధికారుల సంఘం క్యాలెండర్ ను హెచ్ డబ్ల్యు ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మోసిన్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా జిల్లా బీసీ సంక్షేమ అధికారి పురుషోత్తం నాయక్, టిఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి రాజేశ్వర్ టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపు రావు పాల్గొనగా క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అనుముల సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు కేజియా రాణి సంయుక్త కార్యదర్శులు సునీత, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్ బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కుమార్, సరిత తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గాంధీనీ మర్యాద పూర్వకంగా సిడిడివో కవిత



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జనవరి ప్రజా స్వేచ్ఛ**

శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ సిడిపిఓగా బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా కవిత పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీనీ మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేనీ శాలువాతో సత్కరించి అంగన్వాడీ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలను, యూనిఫామ్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రములో చదువుతున్న పిల్లలకు ఉచితంగా ఏక రూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందించడం జరుగుతుందని, మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా పిల్లలకు పౌష్టికాహారం ను నిర్ణిత సమయంలో అందించాలని, చిన్న పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, అన్ని రకాల వసతులు కల్పిస్తూ, చక్కటి పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తూ చక్కటి విద్యను అందించాలని చిన్న పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ను అందించాలని కోరారు. మీకు ఏ చిన్న సమస్య ఎదురైన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని, తన వంతు సహాయ సహకారాలు మీకు ఎల్లవేళల ఉంటాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు కోమలి, మాధురి, జ్యోతి, మరియు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి సాంప్రదాయాలను సంక్రాంతి ఉత్సవాలు వెలికితీస్తాయి

కేకే డిజిటల్ ఆద్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే గాంధీ




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జనవరి11 ప్రజా స్వేచ్ఛ**

మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకే ఎనక్లేవ్ కాలనీ లో కెకె డిజిటల్ వారి ఆద్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బలగం మూవీ ఫేమ్ సంజయ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ముగ్గుల ను తిలకించి, మహిళ సోదరీమణులను అభినందించి, విజేతలకు బహుమతులను పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రధానం చేసారు. ఈ సందర్భంగా పీ ఏ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. సంక్రాంతి సంబురాలలో మహిళ సోదరీమణులు భాగస్వాములు కావడం అభినందనీయం అని, మన సంస్కృతీ సంప్రదాయాలను, సంక్రాంతి పండుగ విశిష్టతను నేటి తరం వారికి తెలియచేయడం ఈ ముగ్గుల పోటీ ప్రత్యేకత అని, దీనిని నిర్వహించిన కెకె డిజిటల్ వారు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమని అన్నారు. సంక్రాంతి వాతావరణం ముందే వచ్చినట్టు కనిపిస్తుందని, సంక్రాంతి పండుగను పల్లె వాతావరణంను ప్రతిబింబించేలా ఈ ముగ్గులు ఎంతగానో గొప్పగా వర్ణించారని, సంక్రాంతి పర్వదినంను ప్రతిబింబించేలా చిత్రపటంతో కూడిన వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయని, వాటిని వేసిన వారిని ప్రత్యేకంగా అభినందినచ్చడం జరిగినది. అదేవిధంగా చూడ చక్కని ముగ్గులు వేయడం చాలా గొప్ప విషయం అని, ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించిన కెకె డిజిటల్, మహిళ కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్ల శ్రీనివాస్ యాదవ్, చంద్రిక ప్రసాద్ గౌడ్, నరేందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సుప్రజ, నరేష్, శివ, శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, చందు, కల్పన,లత, లక్ష్మీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## రూపీ 86.04

**చారిత్రక రికార్డు కనిష్ఠానికి పతనం**

**ఒక్కరోజే 18 పైసలు క్షీణత**




డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మరో ఆల్‌టైమ్ కనిష్ఠానికి పడిపోయింది. శుక్రవారం ఒక్కరోజే 18 పైసలు దిగజారి మునుపెన్నడూ లేనివిధంగా 86 మార్కుకు ఎగువన 86.04 స్థాయికి క్షీణించింది. తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు, దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు, అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు.. రూపీని కూలదోశాయని ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రానుండటంతో అగ్రరాజ్య వ్యాపారానుకూల నిర్ణయాలు పెద్ద ఎత్తున ఉంటాయన్న అంచనాల మధ్య డాలర్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిందని కూడా విశ్లేషిస్తున్నారు. కాగా, గతకొద్ది రోజులుగా క్రమేణా పడిపోతున్న రూపాయి పతనం..
భారతీయ దిగుమతులను మరింత భారం చేస్తుండగా, దేశ ఆర్థిక వ్యవస్థకూ కొత్త చిక్కుల్ని తెచ్చిపెడుతున్నది.

**ఫారెక్స్ రిజర్వులు డౌన్**

ఈ నెల 3తో ముగిసిన వారంలో దేశంలోని ఫారెక్స్ రిజర్వులు మరింతగా క్షీణించాయి. 5.693 బిలియన్ డాలర్లు దిగజారి 634.585 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజాగా ప్రకటించింది. అంతకుముందు వారం కూడా 4.112 బిలియన్ డాలర్లు పడిపోయిన విషయం తెలిసిందే. కాగా, గత ఏడాది సెప్టెంబర్ ఆఖర్లో ఆల్‌టైమ్ హైని తాకు తూ ఫారెక్స్ నిల్వలు 704.885 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. కానీ మూడున్నర నెలల్లో 70 బిలియన్ డాలర్లు హరించుకుపోవడం గమనార్హ

## ఆపిల్ కీలక నిర్ణయం.. టిమ్‌కుక్ వేతనం భారీగా పెంపు..



గ్లోబల్ టెక్ దిగ్గజం ఆపిల్ కీలక నిర్ణయం తీసుకున్నది. కంపెనీ సీఈఓ టిమ్ కుక్ వేతనం 18 శాతం పెంచాలని నిర్ణయించింది. కంపెనీ వార్షిక వాటాదారుల సమావేశానికి నెల రోజుల ముందుగా ఆపిల్ బోర్డు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీని ప్రకారం 2023లో టిమ్ కుక్ వేతనం 63.2 మిలియన్ డాలర్ల (రూ.544 కోట్లు) నుంచి 2024లో 74.6 మిలియన్ డాలర్ల (రూ.643 కోట్లు)కు పెరిగిందని శుక్రవారం తన వార్షిక ప్రాక్సీ ఫైలింగ్‌లో ఆపిల్ వెల్లడించిందిటిమ్ కుక్ కనీస వేతనం మూడు మిలియన్ల డాలర్లు కాగా, స్టాక్ అవార్డుల ద్వారా 58.1 మిలియన్ డాలర్లు, అదనపు పరిహారం రూపేణా 13.5 మిలియన్ డాలర్లు.. చెల్లిస్తారు. గతేడాది నుంచి టిమ్ కుక్ వార్షిక వేతనం గణనీయంగా పెరిగింది. అంతే కాదు, 2025లో టిమ్ కుక్ వేతన ప్యాకేజీలో ఎటువంటి మార్పులు ఉండబోవని ఆపిల్ తేల్చేసింది. ఇక వచ్చేనెల 25న ఆపిల్ వార్షిక సర్వ సభ్య సమావేశం జరుగనున్నది.

## డీ-మార్ట్ సీఈఓగా అన్షుల్ అసవా.. మార్చి 15 నుంచి అమల్లోకి..



డీ-మార్ట్ రిటైల్ చైన్ నెట్‌వర్క్ సీఈఓగా అన్షుల్ అసవాను నియమిస్తున్నట్లు ఆ సంస్థ మాతృసంస్థ ఎవెన్యూ సూపర్‌మార్ట్స్ తెలిపింది. ప్రస్తుత సీఈఓ కం మేనేజింగ్ డైరెక్టర్ నెవిలే నోరూన్‌హం వచ్చే ఏడాది జనవరిలో వైదొలుగుతారు. ఈ నేపథ్యంలో ఎవెన్యూ సూపర్‌మార్ట్స్ తన డీ-మార్ట్ టాప్ మేనేజ్‌మెంట్‌ను పూర్తిగా పునర్వ్యవస్థీకరించింది. కొత్త సీఈఓగా నియమితులైన అన్షుల్ అసవా ఇప్పటి వరకూ యూనీ లివర్ థాయిలాండ్ కంట్రీ హెడ్‌గానూ, గ్రేటర్ ఆసియాలో హెూంకేర్ బిజినెస్ యూనిట్ జనరల్ మేనేజర్‌గా ఉన్నారు.ప్రస్తుత సీఈఓ నెవిలీ నొరోన్హమ్ తన సర్వీసు పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకోలేదని ఎవెన్యూ సూపర్ మార్ట్స్ తెలిపింది. డీ-మార్ట్ విస్తరణకు ఆయన అసాధారణ సేవలను కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ప్రశంసించారు. కొత్తగా నియమితులైన అన్షుల్ అసవా బాధ్యతలు మార్చి 15 నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రస్తుత సీఈఓ నొరోన్హా రెండు దశాబ్దాలుగా డీ-మార్ట్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. ఐదు స్టోర్ల నుంచి 380కి పైగా స్టోర్లను ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర ఎంతో కీలకం. సీఈఓగా బాధ్యతలు చేపట్టేందుకు అన్షుల్ అసవాకు ప్రస్తుత సీఈఓ నెవిల్లే నోరోన్హా పూర్తిగా సహకరిస్తారు.

## సెంచరీతో చెలరేగిన దేవదత్ పడిక్కల్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) బ్యాటర్ దేవదత్ పడిక్కల్(99 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102) సెంచరీతో చెలరేగాడు. ప్రతిష్ఠాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటకు ప్రాతినిధ్యం వహిస్తున్న దేవదత్ పడిక్కల్.. బరోడాతో శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సెంచరీ సాధించాడు. పడిక్కల్ శతకంతో ఈ మ్యాచ్‌లో కర్ణాటక 5 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లో 8 వికెట్లకు 281 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్ సెంచరీకి తోడుగా అనీష్(64 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 52) హాఫ్ సెంచరీతో రాణించాడు. బరోడా బౌలర్లలో రాజ్ లింబాని, అతిత్ షేత్ మూడేసి వికెట్లు తీయగా.. కృనాల్ పాండ్యా, మెరివాలా తలో వికెట్ పడగొట్టారు. అనంతరం బరోడా 49.5 ఓవర్లలో 276 పరుగులకు కుప్పకూలింది. శశ్వాత్ రావత్(126 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 104) సెంచరీతో.. అతిత్ షేత్(59 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 56) హాఫ్ సెంచరీతో రాణించినా ఫలితం లేకపోయింది. కర్ణాటక బౌలర్లలో వాసుకి కౌశిక్, ప్రసిద్ధ్ కృష్ణ, అభిలాష్ శెట్టి, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. సెంచరీతో కర్ణాటక విజయంలో కీలక పాత్ర పోషించిన దేవదత్ పడిక్కల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో దేవదత్ పడిక్కల్‌ను ఆర్‌సీబీ అతని కనీస ధర రూ. 2 కోట్లకు కొనుగోలు చేసింది. ముందుగా పడిక్కల్‌ను తీసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపలేదు. వేలం చివర్లో మరోసారి అతని పేరును వేలంలో ఉంచగా ఆర్‌సీబీ కనీస ధరకు కొనుగోలు చేసింది. ఆర్‌సీబీతోనే దేవదత్ పడిక్కల్ ప్రొఫెషనల్ కెరీర్ ప్రారంభించిన విషయం తెలిసిందే.

# స్పోర్ట్స్

## ఐదు మ్యాచుల్లో ఏడు వికెట్లు..

**నిలకడగా రానిస్తోన్న పేసర్ ముకేశ్ చౌదరి**



విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ లో పంజాబ్, మహారాష్ట్ర మధ్య తలపడ్డాయి. అయితే వడోదరాలోని కొతంబి స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో సీఎస్కే పేసర్, మూడు హ్యాట్రిక్ సెంచరీలతో జోరు మీదున్న పంజాబ్ బ్యాటర్ ను బోల్తా కొట్టించాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో తెగ వైరల్ అవుతోంది. టీమ్‌ఇండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ విజయ్ హజారే ట్రోఫీలో దుమ్మురేపుతున్న సంగతి తెలిసిందే. రీసెంట్ గానే హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రభ్‌సిమ్రన్ (137బీ 105 బంతుల్లో 20 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతక్కొట్టాడు. అంతకుముందు గత రెండు మ్యాచ్‌ల్లో.. ముంబయిపై (150లి), సౌరాష్ట్రపై (125) సెంచరీలు బాదాడు. అలా వరుసగా మూడో సెంచరీలతో చెలరేగి ఆడాడు. అయితే ప్రస్తుతం జరుగుతోన్న విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ ను బోల్తా కొట్టించాడు చెన్నై సూపర్ కింగ్స్ పేసర్ ముకేశ్ చౌదరి. తన సూపర్ బౌలింగ్ తో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో జోరు మీదున్నప్రభ్‌సిమ్రన్ ను ఔట్ చేశాడు. ఈ మ్యాచ్ పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ నాలుగో ఓవర్ లో అతడు పెవిలియన్ చేరాడు. ముకేశ్ పర్ఫెక్ట్ ఔట్ సింగ్ ను సంధించగా, ప్రభ్‌సిమ్రన్ సింగ్ డ్రైవ్ ఆడబోయి ఔట్ అయ్యాడు. బంతి స్వింగ్ అయి ఆఫ్ స్టంప్ మీదుగా వెళ్లింది. దీంతో ఈ రైట్ హ్యాండ్ బ్యాటర్ కేవలం 17 బంతుల్లో 14 పరుగులకే వెనుదిరిగాడు. ముకేశ్ తీసిన వికెట్ తో మహారాష్ట్ర ప్రభ్‌సిమ్రన్ సింగ్ దాడి నుంచి తప్పించుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోనే బీసీసీఐ డొమాస్టిక్ క్రికెట్ తన ఎక్స్ హ్యాండిల్ లో పోస్ట్ చేసింది. ముకేశ్ వేసిన బంతి అదిరింది అంటూ రాసుకొచ్చింది. ముకేశ్ చౌదరి తన ఆరు ఓవర్లలో మూడు వికెట్లు తీశాడు. తన గత ఐదు మ్యాచుల్లో కలిపి ఏడు వికెట్లు దక్కించుకున్నాడు. అంతకుముందు సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నమెంట్ లో మొత్తం 15 వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. కాగా, ఐపీఎల్ మెగా వేలంలో సీఎస్కే ముకేశ్ చౌదరిని రూ.3 కోట్లకు దక్కించుకుంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ ను పంజాబ్ రూ.4 కోట్లకు కొనుగోలు చేసింది.

## రెండో పెళ్ళికి సిద్ధమవుతున్న సానియా

**తెలుగు హీరోతో డేటింగ్ చేస్తోందని పుకార్లు**



భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మరోసారి వార్తల్లో నిలిచింది. 14 ఏళ్ల క్రితం పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో వివాహ బంధం పడి తర్వాత విడాకులు తీసుకున్న ఈ టెన్నిస్ క్వీన్, ప్రస్తుతం తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతోందని టాలీవుడ్ వర్గాల్లో పుకార్లు షికారు చేస్తున్నాయి. షోయబ్ మాలిక్ మరొక మహిళతో ప్రేమలో ఉన్నారని తెలుసుకున్న సానియా, విడాకులు తీసుకుని ఒంటరిగా జీవించడాన్ని ఎంపిక చేసుకుంది. ఆమె కుమారుడు ఇజాన్‌తో సహా తన వ్యక్తిగత జీవితంలో కొత్త విషయాన్ని వెతుక్కుంటోంది. అయితే, ప్రస్తుతం ఒక తెలుగు స్టార్ హీరోతో సానియా డేటింగ్ చేస్తున్నట్లు పుకార్లు జోరుగా వినిపిస్తున్నాయి. టాలీవుడ్ సర్కిల్స్‌లో ఈ హీరో ఎవరు అనే చర్చ ఎక్కువగా సాగుతోంది. అభిమానులు ఈ సంబంధం పెళ్లికి దారితీయబోతుందని నమ్ముతున్నారు. సానియా ఇంకా ఈ వార్తలపై స్పందించకపోయినా, భవిష్యత్ ప్రణాళికల గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇక, షోయబ్ మాలిక్ తన రెండో పెళ్లితో ముందుకు సాగాడు. అతను ప్రముఖ పాకిస్థానీ నటి సనా జావేద్‌ను వివాహం చేసుకున్నాడు, ఇది ఆమెకు కూడా రెండో పెళ్లే. సనా జావేద్, షోయబ్ తమ వివాహ బంధంతో కొత్త జీవితాన్ని మొదలు పెట్టగా, సానియా తన కొత్త జీవిత భాగస్వామితో ఒక కొత్త ప్రయాణానికి సిద్ధమవుతోందని సమాచారం. సానియా జీవితంలోని ఈ కొత్త మలుపు ఆమెకు సంతోషం తెచ్చి, అభిమానులకు మరింత ఉత్కంఠ రేకెత్తిస్తోంది. పెళ్లి వార్తలు నిజమా పుకార్లా అనే దానిపై త్వరలో క్లారిటీ రావొచ్చని అందరూ ఆశిస్తున్నారు.




# సౌత్ వాళ్లు ఆ పనైనా మానిస్తేరు కానీ.. సినిమాలు చూడటం మానరు : రాశిఖన్నా

'ది సబర్మతి రిపోర్ట్' సినిమాతో ఇటీవల సూపర్ హిట్ అందుకుంది నటి రాశి ఖన్నా. ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేసిన ఈ భామ ప్రస్తుతం బాలీవుడ్‌కి షిఫ్ట్ అయిన విషయం తెలిసిందే. షాహిద్ కపూర్ నటించిన ఫర్జీతో పాటు విక్రాంత్ మస్సే 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రాలతో మంచి హిట్లు అందుకుంది. ప్రస్తుతం తెలుగులో సిద్దు జొన్నలగడ్డ నటిస్తున్న తెలుసుకదా సినిమాతో పాటు తమిళంలో అగాథియా అనే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో నటిస్తుంది ఈ భామ. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు సౌత్ సినిమా అభిమానులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాశి మాట్లాడుతూ.. దక్షిణాదిలో సినిమా అభిమానులు ఎక్కువ అక్కడ హీరోలని దేవుడి లాగా కోలుస్తారు. సినిమా విడుదల అప్పుడు పండుగల భావిస్తారు. అందుకే సౌత్‌లో ప్రేక్షకులు తిండి అయిన మానేస్తారు ఏమో కానీ సినిమాలు చూడడం మాత్రం ఆపారు. అదే నార్త్‌లో ప్రజలు సినిమాలు పక్కన పెట్టి మిగతా వాటికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తారు. ఆ తర్వాత సినిమాలు చూస్తారు అంటూ రాశి ఖన్నా చెప్పుకోచ్చింది.



# దూసుకపోతున్న గేమ్‌ఛేంజర్

## మొదటిరోజే రూ.186 కోట్లకు పైగా వసూళ్లు

రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రంలో రామ్ చరణ్ డ్యూయల్ రోల్‌లో నటించి అలరించాడు. అయితే ఈ సినిమా తొలిరోజే రికార్డు కలెక్షన్లు అందుకుంది. మొదటిరోజు ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.186 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ ఫీట్ సాధించిన టాప్ టెన్ ఇండియన్ సినిమాలలో గేమ్ ఛేంజర్ కూడా నిలిచింది. ఇక మొదటి రోజు అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాలు చూసుకుంటే.. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ది రూల్ చిత్రం మొదటి స్థానంలో ఉంది. ఈ చిత్రం ఫస్ట్ రోజు రూ.294 కోట్ల వసూళ్లను రాబట్టింది. పుష్ప తర్వాత రాజమౌళి ఆర్ఆర్ఆర్ (రూ.223 కోట్లు), బాహుబలి 2(రూ.214 కోట్లు) చిత్రాలు ఉన్నాయి.

# ఆ నొప్పులు సరదాగా ఉంటాయ్



టాలీవుడ్ హీరోయిన్ సమంత.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. తనకు సంతోషం కలిగినా, బాధ కలిగినా.. ప్రతీ విషయాన్ని ఆమె తన అభిమానులతో సోషల్ మీడియాలో పంచుకుంటుంది. అలానే తాజాగా సమంత సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఇటీవల తాను చికెన్ గున్యా వ్యాధి బారిన పడినట్లు సమంత తెలిపింది. అయితే ప్రస్తుతం ఆ వ్యాధి నుంచి కోలుకుంటున్నట్టు ఆమె వెల్లడించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ జిమ్‌లో వర్కౌట్స్ చేస్తున్న ఓ వీడియోను సమంత్ షేర్ చేసింది. చికెన్ గున్యా వల్ల వచ్చిన కీళ్లనొప్పులు నుంచి కోలుకోవడం అనేది చాలా ఫన్‌గా ఉంటుందంటూ ఆ బ్యూటీ రాసుకొచ్చారు. సమంత త్వరగా కోలుకోవాలంటూ ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. గతంలో సమంత మయోసైటిస్ అనే వ్యాధి బారిన పడిన సంగతి తెలిసిందే. ఖుషి మూవీ టైమ్‌లో తాను ఈ వ్యాధి బారిన పడినట్లు ఆమె తెలిపింది. అప్పట్నుంచి తన ఆరోగ్యం క్షీణించిందని చెప్పింది. మయోసైటిస్ చికిత్స కోసం మెడిసిన్స్, ఆయుర్వేదం, భూటాన్‌లో ప్రకృతి వైద్యం ఇలా రకరకాల పద్ధతుల్ని సమంత ప్రయత్నించింది.

# ఆ ఊరి అమ్మాయితోనే ప్రభాస్ పెళ్లి

## ఆసక్తిగా మారిన రాంచరణ్ కామెంట్



టాలీవుడ్‌లో మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ ఎవరైనా ఉన్నారంటే.. అది మన డార్లింగ్ రెబల్ స్టార్ ప్రభాస్ మాత్రమే. ఆయన పెళ్లి కోసం ఒక్క తెలుగు రాష్ట్రాలే కాదు.. దేశమంతా ఎదురుచూస్తోంది. ప్రపంచంలోని ఫ్యాన్స్ కూడా ప్రభాస్ పెళ్లి ఎప్పుడా అని ఎదురుచూస్తున్నారు. అయితే ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్‌ను రెబల్ స్టార్ పెళ్లాడుతారని అనేక వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు అలాందేమీ జరగలేదు. ఓ రెండేండ్ల క్రితం భీమవరానికి చెందిన రాజుల అమ్మాయిని పెళ్లాడుతారని వార్తలు షికారు చేశాయి. ఈ వార్తలు కూడా గాసిప్‌గానే మిగిలిపోయాయి. ఇప్పుడు మళ్లీ ప్రభాస్ పెళ్లిపై వార్తలు షికారు చేస్తున్నాయి. ప్రభాస్ పెళ్లిపై మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హింట్ చేశారు. 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రమోషన్స్ కోసం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్.. బాలకృష్ణ 'అన్ స్టాపబుల్' షోలో ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. బాలయ్య.. ప్రభాస్ పెళ్లి గురించి ప్రస్తావన తీసుకురాగా ప్రభాస్ ఫ్యాన్స్‌కు తీపి కబురు అందించారు. అవును.. షోలో ప్రభాస్ ఏ ఊరి అమ్మాయిని పెళ్లి చేసుకోనున్నాడో చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ అమ్మాయి ఎవరో కాదు.. పదహారు అణాల తెలుగు అమ్మాయి. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరంకు చెందిన అమ్మాయిని ప్రభాస్ పెళ్లాడబోతున్నట్లు చరణ్ వెల్లడించినట్లు సమాచారం. దీంతో ఈ వార్తలు సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతున్నాయి. కాగా, ప్రభాస్ ఫ్యాన్స్ ఈ వార్త నిజం కావాలని గట్టిగా కోరుకుంటున్నారు. త్వరలోనే ప్రభాస్‌ను పెళ్లిపీటలపై చూడాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492